
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

మంగళవారం 8 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 24.0

చర్చ

సాధారణంగా ప్రధాన రహదారుల వెంట మడిగెలు అద్దెకు లభించడం కష్టతరం. ఒక దుకాణం ఖాళీ అవుతుందంటే ఆ మడిగె అద్దెకోసం ఇతర వ్యాపారులు పోటీ పడుతుంటారు. ఇందుకు యజమానులను మచ్చిక చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా తెలిసిన వారితో సిఫార్సులు చేయిస్తుంటారు. కానీ ఇందుకు భిన్నమైన పరిస్థితి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో నెలకొంది. అద్దెలు పెరగడంతో పాటు వ్యాపారాలు తగ్గడంతో మడిగెలు ఖాళీ అవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)



భువనగిరిలో టూలెట్ బోర్డులు

అద్దెకివ్వబడును

» ఖాళీ అవుతున్న మడిగెలు
» పెరుగుతున్న టూ లెట్ బోర్డులు
» తగ్గిన వ్యాపారులు » పెరిగిన అద్దెలు


భువనగిరిలోని పట్టణ ప్రధాన రహదారులవెంట పదుల సంఖ్యలో మడిగెలు ఖాళీగా ఉండి నెలలుగా టూలెట్ బోర్డులు కన్పిస్తున్నాయి. పట్టణంలో వ్యాపారమంతా పట్టణ ప్రధాన రహదారి అయిన హైదరాబాద్-వరంగల్ రహదారి కేంద్రంగా సాగుతోంది. దీంతో కొద్దికాలం క్రితం వరకు ఈ రోడ్డులో మడిగె లభించడం గగనంగా ఉండేది. కానీ నేడు ఈరహదారి వెంట పదుల సంఖ్యలో మడిగెలు కొన్ని నెలలుగా ఖాళీగా ఉంటున్నాయి. అంతేగాక ఖాళీ మడిగెల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఇందుకు ప్రధాన కారణం వ్యాపారాలు తగ్గడం, మడిగె అద్దెలు పెరగడం, హైదరాబాద్‌కు పెరిగిన రవాణా సదుపాయం, ఆన్‌లైన్ మార్కెటింగ్, షాపింగ్ మాల్స్ అని దుకాణాలు ఖాళీ చేస్తున్న చిన్న వ్యాపారులు పేర్కొంటున్నారు. రెండేళ్ల క్రితం చేపట్టిన పట్టణ ప్రధానరహదారి 100 అడుగుల విస్తరణతో పలు మడిగెల మందుభాగాన్ని అధికారులు సేకరించారు. దీంతో భవన యజమానులు మడిగెలకు మరమ్మతులు చేసి ఆధునికీకరించారు. ఇదే అదనుగా అద్దెలు భారీగా పెంచారు.

ఉచిత బస్సు ప్రయాణంతో..

ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాటి నుంచి పరిస్థితి మారిపోయింది. గతంనుంచే భువనగిరి, పరిసర ప్రాంతాల ప్రజలు చిన్నపాటి షాపింగ్‌కు కూడా హైదరాబాద్ వెళ్లే అలవాటు ఉంది.దీంతో అందుబాటులోకి వచ్చిన ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు జట్లుగా కిరాణం, రోజువారీ వినియోగించే దుస్తులు, గృహోపకరణాలకు చివరికి చెప్పులకు కూడా హైదరాబాద్, సికింద్రాబాద్, బేగంబజార్, పత్తర్‌గట్టి, కూరగాయాలు, పండ్ల మార్కెట్, షాపింగ్‌మాల్స్ సూపర్ బజార్‌లకు వెళ్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పురుషులు కూడా అదే బాట పడుతున్నారు. ఔషధాలు, ఆహార పదార్థాలతోపాటు అన్ని వస్తువులను ఆన్‌లైన్ ట్రేడర్స్ కొరియర్స్ ద్వారా ఇంటి వద్దకు చేరవేస్తున్నారు. దీంతో అప్పటికే అంతంత మాత్రమే నడిచే చిన్న వ్యాపారులు కుదేలవుతుండటంతోపాటు అద్దెలు రెట్టింపు కావడంతో...

- మిగతా 8వ పేజీలో...

కరోనా తర్వాత ఆన్‌లైన్‌లోనే



కరోనా తర్వాత సుమారు అన్ని వస్తువులను ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేస్తున్నా. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరలు ఉండటం, ఇంటి వద్దకు చేరవేస్తుండటం, నచ్చిన బ్రాండ్ లభిస్తుండడంతో ఆన్‌లైన్ కొనుగోలుకే మొగ్గు చూపుతున్నా. చిన్నపాటి అవసరాలకు మాత్రమే స్థానిక దుకాణాలకు వెళ్తున్నా. ఆన్‌లైన్ కొనుగోలు ద్వారా మాకు కొనుగోలు సమయం, ఇబ్బందులు తప్పాయి. ప్రత్యేకించి యువత ఆన్‌లైన్ కొనుగోళ్లకే మొగ్గు చూపుతోంది.

- సీహెచ్ కమలాకర్, భువనగిరి.

డబ్బా దుకాణంలోనే కొనసాగుతున్నాను



ప్రధాన రహదారుల వెంట ఊహించని స్థాయిలో ఉన్న అద్దెలు, అడ్వాన్సుల కారణంగా డబ్బా దుకాణంతోనే సరిపెట్టుకుంటున్నా. మడిగెలో మా బ్యాంగిల్ స్టోర్స్‌ను పెడితే ప్రస్తుతం కంటే కాస్త మెరుగ్గా నడుస్తుంది. కానీ అంతకు మించి అద్దె చెల్లించాల్సి ఉండటంతో నష్టాలకు గురవుతాం. రెండేళ్ల నుంచి భవన యజమానులు పెంచుతున్న అద్దెలతో పలువురు చిరు వ్యాపారులు దుకాణాలను తీసివేస్తున్నారు.

- నువ్వుల నర్సింహ, రూపా బ్యాంగిల్ స్టోర్స్, భువనగిరి.

కొనుగోలు కేంద్రాలేవీ?

» తెరవని ధాన్యం కొనుగోలు కేంద్రాలు » తక్కువ ధరకు దళారులకు విక్రయిస్తున్న రైతులు

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. గుండాల మండలంలో వరికోతలు ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా. చాలా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి రోజులు గడుస్తున్నా చేసేది లేక రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-గుండాల)



గుండాలలో ధాన్యాన్ని ఆరబోసిన రైతులు

ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులను అడిగితే తమకు ఏమీ పట్టనట్లుగా సమస్యను దాటవేస్తున్నారని మండలంలోని పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. పంట చేతికొచ్చి రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఇదే అదనుగా రైతులను దళారులు దొరికిన కాడికి దోచుకుంటున్నారు. మండలంలోని 20 గ్రామపంచాయతీలకు గుండాల, వస్తాకొండూరు, పెద్దపడిశాల, వెల్మజాల గ్రామాల్లో మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. మిగతా గ్రామాల్లో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ప్రతీ సంవత్సరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో 10, ఐకేపీ ఆధ్వర్యంలో ఎనిమిది ధాన్యం కొనుగోలుకేంద్రాలను ప్రారంభిస్తున్నా, ఇప్పటికీ కొనుగోలు విషయమై ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

కేంద్రాలు ప్రారంభమయ్యేనా..?

గుండాల మండలంలోని 20 గ్రామపంచాయతీలకు 12వేల ఎకరాల వరకు రైతులు...

- మిగతా 8వ పేజీలో...

ప్రజారోగ్యానికి తల్లీ బిడ్డ ఆరోగ్యం మూలస్తంభం

● డీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్



భువనగిరిలో ఆరోగ్య దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది

భువనగిరిటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తల్లీ, బిడ్డ ఆరోగ్యం ప్రజారోగ్యానికి మూలస్తంభం లాంటిదని డీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్ అన్నారు.సోమవారం భువనగిరిలో నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో ఆయన మాట్లాడారు. తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అన్నారు. మాతా శిశు మరణాల శాతాన్ని గణనీయంగా తగ్గించేందుకు సమిష్టి కృషి అవసరం అన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటే ధనాన్ని పొదుపు చేసినట్టేనని, ఆరోగ్యవంతులు కుబేరులన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2025 సంవత్సర లక్ష్యమైన ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను సాధించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అంతకుముందు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాతా శిశు సంరక్షణ జిల్లా అధికారి యశోద, డిప్యూటీ డీఎంహెచ్‌వో శిల్పిని, జిల్లా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ అధికారి రామకృష్ణ, జిల్లా శిక్షణ అధికారి వీణ, జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి సుమన్‌కళ్యాణ్, పట్టణ వైద్యాధికారి వసంతకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, డీపీఎంహెచ్‌వో సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి



ప్రజావాణిలో బాధితుల నుంచి వినతులు తీసుకుంటున్న అదనపు కలెక్టర్ జీ.వీరారెడ్డి

అదనపు కలెక్టర్(రెవెన్యూ) జీ.వీరారెడ్డి

భువనగిరి(కలెక్టరేట్),ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ లేకుండా ప్రజావాణి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) జీ.వీరారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల వినతులు, ఫిర్యాదులకు సంబంధించి 59 దరఖాస్తులను స్వీకరించారు. వాటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు చెందిన 38 దరఖాస్తులు రాగా, జిల్లా పంచాయతీకి 7, మున్సిపాలిటీకి 7, వైద్య ఆరోగ్య శాఖ 2, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, వ్యవసాయ, హౌసింగ్, విద్యాశాఖ, లీడ్ బ్యాంక్‌లకు ఒక్కో దరఖాస్తు చొప్పున వచ్చాయి. ప్రజలు గ్రీవెన్స్‌డేలో చేసుకున్న దరఖాస్తులను... రాష్ట్ర ప్రజావాణిలో వచ్చిన వాటిని కూడా పరిశీలించి పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, కలెక్టరేట్ ఏవో జగన్‌మోహన ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి

రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ సూచించారు. 2024-25 యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి వ్యవసాయ,మార్కెటింగ్ శాఖలు రూపొందించిన వాల్ పోస్టర్లు, బ్రోచర్లను కలెక్టరేట్‌లో ఆయన సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. నిబంధనలమేరకు ప్రభుత్వం ఏ-గ్రేడ్‌రకం ధాన్యానికి రూ.2,320, సాధారణరకం ధాన్యానికి రూ.2,300 ప్రకటించిందని, సన్నరకం ధాన్యానికి అదనంగా క్వింటాకు రూ.500బోనస్ అందిస్తుందన్నారు. అదేవిధంగా సన్నరకం ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామని, కనీస మద్దతు ధరకు నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సబిత, జిల్లా సహకారాధికారి శ్రీధర్, వ్యవసాయాధికారి పీ.గోపాల్, జిల్లా పంచాయతీ అధికారి సునంద తదితరులున్నారు.

జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

ఈ నెల 11న మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ జీ. వీరారెడ్డి తెలిపారు. జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాలపై కలెక్టరేట్‌లో వివిధ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జయంతి ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ నెల 11న భువనగిరిలో జ్యోతిబాపూలే విగ్రహం వద్ద నిర్వహించే కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణారెడ్డి, బీసీ సంక్షేమాధికారి యాదయ్య, ఎస్సీ సంక్షేమాధికారి వసంత కుమారి, మున్సిపల్ కమిషనర్ రామలింగం, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వినతులు ఇలా..

- గ్రామీణ వికాస్ బ్యాంకు తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారడంతో తమకు రైతు రుణమాఫీ కాలేదని, మూడు నెలలుగా వందలమంది రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగినా సాంకేతిక సమస్యతో డబ్బులు జమ కావడం లేదని బొమ్మల రామారం మండలానికి చెందిన రైతులు వినతి పత్రం అందజేశారు.
- దత్తాయపల్లి పాఠశాల క్రీడాస్థలం కబ్జా కాకుండా చూడాలని తుర్కపల్లి మండలం దత్తాయపల్లికి చెందిన పూర్వ విద్యార్థులు ఫిర్యాదు చేశారు.
- తప్పుడు ధ్రువపత్రాలతో నిర్మిస్తున్న నిర్మాణాలను కూల్చివేయాలని చౌటుప్పల్‌కుచెందిన సామాజిక కార్యకర్త ఆంజనేయచారి ఫిర్యాదు చేశారు.
- సూక్ష్మ రుణ సంస్థల ఆగడాలను అరికట్టాలని యాదగిరిగుట్ట మండలంలోని 20 గ్రామాల వీవోఏలు ఫిర్యాదు చేశారు.

గ్రామీణ కళాకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి




రాజచారికి పురస్కారాన్ని అందజేస్తున్న అభినయ శ్రీనివాస్, పక్కన నర్సింహారెడ్డి

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కవి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విపంచి ఫౌండేషన్ తెంగాణ శాఖ ఆధ్వర్యంలో వివిధరంగాల్లో గుర్తించిన కళాకారులు, సంఘసేవకులకు ఉగాది పురస్కారాలు-2025ను అందజేశారు. చౌటుప్పల్ పట్టణానికి చెందిన ఉత్తమ గాయకుడు పోలోజు రాజు చారి(2022), ఉత్తమ యక్షగాన కళాకారుడు చిట్టిపోలు వెంకటేశం (2023)లకు ఉగాది పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్, సినీగేయ రచయిత అభినయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి జీవితం తరతరాలకు ఆదర్శం

ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరాముడి జీవితం తరతరాలకు ఆదర్శమని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భువనగిరిలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాముడు చూపిన కుటుంబ, రాజధర్మం విలువలను అందరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు దేవరకొండ నరసింహాచారి, భువనగిరి గణేష్, ఉత్సవ సమితి అధ్యక్షుడు రత్నపురం బలరాం, తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేజ్ చిస్తీ, మునిసిపల్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ చైర్మన్ దశరథ, రత్నపురం బలరాం, కూర వెంకటేష్, కిరణ్‌కుమార్, నర్సింగరావు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



గుండాల మండలం తుర్కలషాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్నప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

గుండాల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. జైబాపు, జైబీమ్, జై సంవిదాన్ కార్యక్రమంలో భాగంగా తుర్కలషాపురం గ్రామంలో బాపూజీ, అంబేడ్కర్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామప్రజలకు మహనీయుల గురించి తెలియజేయడానికే ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అంబేడ్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఏలూరి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ ద్యాప కృష్ణారెడ్డి, నాయకులు ఇమ్మడి దశరథ, లింగాల బిక్షం, నారాయణ, యాదగిరి, రాజరత్నం, సంగి వేణు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

రైతు శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గుండాల, పెద్దపడిశాల, వస్తాకొండూరు, వెల్మజాల గ్రామాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తెచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2లక్షల లోపు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. ధాన్యం విక్రయించిన రెండు మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్యపై సమీక్ష

గుండాల మండలంలోని బండకొత్తపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రజలకు తాగు నీరు సమస్య లేకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీటీ నీలిమా, మండల వైద్యాధికారి హైమావతి, వెటర్నరీ డాక్టర్ యాకూబ్, ట్రాన్స్‌కో ఏఈ అంబాల నర్సింహులు పాల్గొన్నారు.

ఆలేరును అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం

ఆలేరు: ఆలేరును అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. పట్టణంలోని రైల్వే అం డర్‌పాస్ బ్రిడ్జి వద్ద సోమవారం బీటీ రోడ్డు పనులు ప్రా రంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఆరేళ్ల గా అసంపూర్తిగా ఉన్న ఆర్‌యూబీ పనులను కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో రూ.13కోట్లతో పనులు పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, డైరెక్టర్ ఎగ్గిడి యాదగిరి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవరెడ్డి, మండల, పట్టణ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వర రాజు, ఎజాజ్ పాల్గొన్నారు.

విజయదుర్గా పీఠంలో కలెక్టర్ పూజలు

రాయవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాన్ని కలెక్టర్ కె.హనుమంతరావు సోమవారం సందర్శించారు. విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, హారతులు నిర్వహించారు. పీఠంలో భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి కలెక్టర్ స్వయంగా పూజలు చేశారు. పీఠంలో నవగ్రహ, నక్షత్ర హోమం, పూర్ణాహుతిలో పాల్గొన్నారు. అనంతరం పీఠాధిపతి ఆశీస్సులు తీసుకున్నారు. పీఠం పరిపాల నాధికారి వీవీ బాపిరాజు, పీఠం ప్రతినిధి గాదె భాస్కరనారాయణలు కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు బలిజేపల్లి రమ, గాదె సత్యవెంకట కామేశ్వరి, పెదపాటి సత్యకనకదుర్గ పాల్గొన్నారు.



విజయదుర్గాపీఠంలో పూజల్లో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

● వేసవిలో ముందస్తు చర్యలు చేపట్టాం
● 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్‌లో యాదగిరిగుట్ట ఎంపీడీవో నవీన్ కుమార్



8

ఆటాడుకుందాం

శారీరక, మానసిక వికాసంలో ఆటలకు ఉన్న ప్రాధాన్యం ఎంతో గొప్పది. పూర్వీకుల నుంచి ఆటల పట్ల ఉన్న ఆ ప్రాధాన్యం మాటల్లో చెప్పలేనిది. రేడియో, టెలివిజన్ వంటి వినోద సాధనాలు రాకముందు వినోదం, మానసిక చురుకుదనం, ఐక్యమత్యం, పట్టుదల, స్నేహ సంబంధాలతో పాటు ఆరోగ్యం, ఆనందానికి ఆటలు ప్రేరకాలుగా ఉండేవి. అందుబాటులో ఉన్న వస్తువులు, పరికరాలతో ఆట వస్తువులను తయారుచేసుకుని ఆడటం పూర్వపు రోజుల్లో కనిపించేవి. గ్రామాల్లో తీరిక వేళల్లో , వెన్నెల రాత్రుల్లో లింగబేధం లేకుండా, వయస్సుల తారతమ్యం పాటించకుండా ఆడేవారు. ఆటలు వారి జీవన ప్రయాణంలో భాగస్వామ్యమై ఉండేవి. అంతటి ప్రాధాన్యం ఉన్న అప్పటి ఆటల్లో కొన్ని....

- (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

- శారీరక ఆరోగ్యం, వినోదమే ప్రధానంగా అప్పటి ఆటలు
- పెరిగిన సాంకేతికతతో మరుగునపడ్డ ఆటలు
- డిజిటల్ గేమ్స్‌తో కనుమరుగు





రోజురోజుకూ సాంకేతికపరమైన వస్తువులపై మక్కువ చూపిస్తుండటంతో ఆటలపై పిల్లలో అనాసక్తి మొదలైంది. దీంతో గత కాలపు ఆటలు కనుమరుగయ్యే దశకు చేరుకున్నాయి. ప్రధానంగా అండ్రాయిడ్, గేమింగ్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు పిల్లల చేతుల్లోకి రావడంతో శారీరక శ్రమకొర్చే ఆటలపై ఆసక్తి చూపించడం లేదు. దీంతో శరీరానికి శ్రమ కరువై వారు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధానంగా చిన్నవయస్సులోనే కంటి సమస్య, పొట్ట రావడం, మానసికఒత్తిడితో అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. పిల్లలు అందరూకలిసి జట్టుగా ఆటలు ఆడకపోవడంతో పిల్లల మధ్య స్నేహ సంబంధాలు తగ్గిపోతున్నాయి. ఇప్పటికైనా తల్లిదండ్రులు స్పందించి గత ఆటల సంస్కృతీ, సంప్రదాయాలపై వారికి ఆసక్తిని కలిగించేలా, పిల్లలు స్మార్ట్‌ఫోన్లకు పరిమితం కాకుండా అందరితో కలిసి ఆడుకునేలా ప్రత్యేక దృష్టి సారించి ఆనాటి ఆటలు కనుమరుగు కాకుండా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉంది. గతంలో పాఠశాలలకు విద్యార్థులు వెళ్లాలంటే ఇంటి నుంచి కిలోమీటర్ నుంచి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరం కాలినడకన వెళ్లేవారు. దీంతో నడక చిన్నతనంలో అలవాటైపోవడంతో ఇప్పుడు వారు ఎంతో ఆరోగ్యం ఉన్నారు. అంతేకాకుండా పాఠశాల మైదానంలో విద్యార్థులు అందరూ కలిసి రకరకాలు ఆటలు ఆటడంతో వారిలో స్నేహబంధాలు, పట్టుదల, ఐక్యమత్యం, మానసిక ప్రశాంత ఏర్పడి ఎలాంటి రోగాల బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉన్నారంటే అన్నింటికి కారణం ఆటలు. ప్రభుత్వాలు సైతం విద్యార్థులకు చదువుతో పాటుగా ఆటలపై అవగాహన కల్పించి ప్రత్యేక దృష్టి సారించి ప్రతి పాఠశాలలో ప్రత్యేకంగా పీఈటీలను నియమించి చక్కదిద్దాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

గతకాలపు ఆటలు

టైరాట	వంగుడు దుంకుడు	కుంటరా గాడిద కుంటూ
వీరివీరి గుమ్మడిపండు	రేసాట	చిర్రగోనే
కోతికొమ్మచ్చి	బొమ్మరిల్లు	కబడ్డీ
అల్లం-దుర్గం	ముక్కు గిచ్చుడు	సీసం గోళీకాయల
బొంగారాల	దస్తే బిస్తడి	వనగుంటలు
కైలాసం	చెల్లెల బండి	పుంజీతం
అష్టాచమ్మ	గచ్చకాయల	చెస్
దోపుడుపుల్ల	ఉప్పు బెరలాట	క్యారంబోర్డు
నాలుగు రాళ్లు		

ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించాలి



ప్రభుత్వాలు క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థుల్లో దాగియున్న నైపుణ్యాన్ని వెలికితీయాలి. క్రీడాకారులు మండల స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఆధారపడి ఉంది.

- పూల నాగయ్య, రిటైర్డ్ పీఈటీ

గచ్చకాయలు, ముక్కు గిచ్చుడు ఇష్టం



చిన్నప్పుడు గ్రామంలో సాయంకాలం స్నేహితులు అందరం కలిసి గచ్చకాయల ఆట, అష్టాచెమ్మ, దోపుడు పుల్ల, ఉప్పు బెరడు, చిక్కుడు బిల్ల, బొమ్మరిల్లు, సెల్లెల బండి ఆట ఆడుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చేది. తోటి స్నేహితులు ఎవరైనా గొడవపడితే ముక్కు గిచ్చుడు ఆట ఆడితే వారిని కోపంతో గట్టిగా గిచ్చేవాళ్లం. వేసవిలో ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా అమ్మానాన్న కైలాసం ఆట ఆడించేవారు. ఎక్కువగా పాపాలు ఎవరు చేస్తే వారిని అనకొండ పాము మింగుతుందని అనడంతో ఎంతో భయపడేవాళ్లం. కైలాసం ఆట అంటే ఎంతో ఇష్టం.

- చంద్రగాని అయిలమ్మ, వంగపల్లి

చిర్రగోనె, కబడ్డీ ఆటలపై మక్కువ ఎక్కువ



గతంలో పాఠశాల వదలగానే ఇంటికి వెళ్లి నలుగురు కలిసి చిర్రగోనె, కబడ్డీ ఆటలు ఆడితే ఎంతో సంతోషంగా ఉండేది. స్నేహితులంతా కబడ్డీలో తాము గెలువాలం టే, తాము గెలుస్తామంటూ పోటాపోటీగా ఆడి సంతోషపడేవాళ్లం. నాటి ఆటలు నేటి పిల్లలకు అందకుండా పోతున్నాయి.

- బోగ సంజీవ, యాదగిరిగుట్ట

ఆనాటి ఆటలు నేటి తరానికి అందించాలి



ఆనాటి ఆటలను తల్లిదండ్రులు పిల్లలతో ఆడిస్తూ ఆటల గురించి వాటిని వివరించాలి. ఆటల సంస్కృతీ, సంప్రదాయాలు పిల్లలకు తెలియపర్చాలి. అలనాటి ఆటలు అంతరించకుండా భావితరాల వారికి అందించేలా ప్రతీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

- పేరబోయిన పెంటయ్య, కొత్తగుండ్లపల్లి

పిల్లలను స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి



చిన్ననాటి నుంచే పిల్లలకు స్మార్ట్‌ఫోన్లు ఇవ్వకుండా వారిని దూరంగా ఉంచాలి. ఫోన్లు ఇవ్వడంతో ఇతర ఆటలపై ఆసక్తి ఉండకుండా పోవడమే కాకుండా వారిలో అనారోగ్య సమస్యలు, కంటి సమస్యలు ఎక్కువగా తలత్తే ప్రమాదం ఉంది. వాటిని నివారించి అలనాటి ఆటలను ఆడించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, అందరిపై ఉంది.

- పేరబోయిన రేణుక, కొత్తగుండ్లపల్లి

ఆర్థిక ఇబ్బందులతో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య



శ్రీనివాస్‌రావు(ఫైల్)

నాగార్జునసాగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో సోమవారం జరిగింది. ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం సాగర్ హిల్‌కాలనీకి చెందిన నెల్లం శ్రీనివాస్‌రావు(42) డిండిలో నీటిపారుదల శాఖ విభాగంలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యం, ఆర్థికసమస్యలతో ఇబ్బందులుపడుతున్నాడు. సోమవారం ఉదయం 11గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. బయటకు వెళ్లివచ్చిన భార్య విజయశ్రీ గమనించే సమయానికే మృతి చెందాడు. విజయశ్రీ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. శ్రీనివాసరావుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అనారోగ్య సమస్యలతో యువతి



మౌనిక (ఫైల్)

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలతో యువతి ఆత్మహత్యకు పాల్పడింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ పట్టణ కేంద్రం రాంనగర్‌కు చెందిన గుండ్ల మౌనిక(25) అవివాహితురాలు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. మనస్తాపానికి గురైన మౌనిక ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకుంది. తండ్రి రామచంద్రయ్య బయటికి వెళ్లి వచ్చేసరికి మౌనిక మృతి చెందింది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి రామచంద్రయ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో ప్రైవేట్ ఉద్యోగి..



జనార్దన్(ఫైల్)

పెన్‌పహాడ్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ గోపీకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సింగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గుణగంటి జనార్ధన్(37) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. భార్య చంద్రకళతో పాటు ఇద్దరు కుమార్తెల ఉన్నారు. అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చి వెళ్తుంటాడు. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి సమీపంలోని గుడుగుంట్లపాలెం వద్ద ఉన్న గురుకుల హాస్టల్‌లోని కుమార్తెను తీసుకురావడానికి చంద్రకళ వెళ్లింది. సాయంత్రం కుమార్తెతో కలిసి తిరిగి వచ్చే సరికి ఇంట్లో గుణగంటి జనార్ధన్(37) ఉరివేసుకుని కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శవపంచనామా అనంతరం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. తనకు తెలియకుండా అప్పులు చేసి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీకృష్ణ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి బావిలో పడి మృతి

కట్టంగూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మానసిక స్థితి బాగోలేక ప్రమాదవశాత్తు బావిలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. నల్లగొండ జిల్లా కట్టంగూరు ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పరడ గ్రామానికి చెందిన కాసర్ల శ్రీనివాస్ రెడ్డి(47) కొంతకాలంగా మానసిక స్థితి బాగోలేక ఇబ్బందిపడుతున్నాడు. ఈ నెల 2న సాయంత్రం ఇంటి నుంచి బయటకువెళ్లాడు. రాత్రి వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. మండలంలోని ఈదులూరు గ్రామ శివారులోని మారబోయిన కలమ్మ వ్యవసాయ బావిలో గుర్తుతెలియని మృతదేహం నీళ్లపై తేలింది. స్థానికుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న శ్రీనివాసరెడ్డి బంధువులు వెళ్లి మృతదేహాన్ని చూసి గుర్తించారు. శ్రీనివాసరెడ్డి భార్య విడాకులు తీసుకుని వెళ్లిందని తల్లి కాసర్ల యాదమ్మ పోలీసులకు తెలిపింది. యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. తన కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నాట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఒక కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

10 తులాల బంగారం అపహరణ

మునుగోడు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కచలాపురంలో భారీ చోరీ జరిగింది. సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం కచలాపురం గ్రామానికి చెందిన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో సోమవారం ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 10తులాల బంగారం అపహరించారు. పనులు ముగించుకొని ఇంటికి వెళ్లే సరికి చోరి జరిగిందని గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ రవి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ తెలిపారు. బంగారం విలువ రూ.9 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

గడ్డివాము దగ్ధం



వేములపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఆమనగల్లు గ్రామానికి చెందిన బయ్యా సైదులు పశువుల మేత కోసం ఎనిమిది ఎకరాల గడ్డిని గ్రామసమీపంలోని బండపైన గడ్డివాము వేశాడు. సోమవారం మధ్యాహ్నం ప్రమాదశాత్తు నిప్పంటుకోని దగ్ధమవుతుండగా గమనించిన స్థానికులు నీటిట్యాంకర్ సహాయంలో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ పూర్తిగా దగ్ధమైందన్నారు. సుమారు రూ.50వేల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు బయ్యా సైదులు ఆవేదన వ్యక్తం చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

భువనగిరి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి ఖిల్లా వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఆలేరుకు చెందిన కే శ్రీధర్‌చారి(21), భువనగిరికి చెందిన రంగాపురం నవదీప్ బైకులపై ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇరువురిని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా శ్రీధర్‌చారి చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు శ్రీధర్‌చారి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

● కేతేపల్లి : సూర్యాపేట జిల్లా కేతేపల్లి మండలంలో హైదరాబాద్-విజయవాడ రహదారిపై రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన కందికంటి అశోక్ తన బైక్‌పై నకిరేకల్ వెళుతున్నాడు. బైక్ ఇనుపాముల శివారులోకి రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కకు వేగంగా దూసుకెళ్లి చెట్టుకు ఢీకొట్టింది. ఈ సంఘటనలో అశోక్ కాలు తెగి పూర్తిగా శరీరం నుంచి విడిపోయి దూరంగా పడిపోయింది. సంఘటనా సమాచారం అందుకున్న 108సర్వీసు సిబ్బంది క్షతగాత్రుడిని సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

● వేంపాడులో ఎమ్మెల్సీ కోటిరెడ్డి డ్రైవర్...



నర్సింహ(ఫైల్)

నిడమనూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి వద్ద వ్యక్తిగత డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వేంపాడ్ సమీపంలో సోమవారం జరిగింది. ఎస్ఐ ఉప్పు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన ఉప్పునూతల నర్సింహ(41) ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి వద్ద వ్యక్తిగత డ్రైవరుగా పనిచేస్తూ మిర్యాలగూడలోని బాపూజీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం విధులు ముగించుకున్న నర్సింహ స్వగ్రామమైన ఎర్రబెల్లికి వెళ్లి పొలం పనులు చూసుకుని తిరిగి బైక్‌పై సాయంత్రం నాలుగు గంటల సమయంలో మిర్యాలగూడకు బయలుదేరాడు. నిడమనూరు మండలం వేంపాడ్ సమీపంలో అన్నారం స్టేజీ దగ్గర ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని ఓ వాహనం ఢీకొనడంతో బైక్‌పై ఉన్న నర్సింహ కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నర్సింహ మృతితో ఎర్రబెల్లి, పరిసర గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే నర్సింహ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్న విషయం జీర్ణించుకోలేకపోతున్నారు. నర్సింహ మృతదేహం వద్ద కుటుంబసభ్యులు బోరున విలపించారు. నర్సింహకు భార్య రామేశ్వరి, ఇద్దరు కుమారులు ఈశ్వర్, అజయ్ ఉన్నారు. ఆస్పత్రిలో ఉన్న నర్సింహ మృతదేహన్ని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. నర్సింహ భార్య రామేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

● నూతనకల్ : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిన్ననేమిల క్రాస్ రోడ్డు వద్ద సూర్యాపేట-జనగాం 365 జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం మద్దిరాల మండలం మామిండ్లమడవ గ్రామానికి చెందిన షేక్ మల్సూర్ తన బైక్‌తో చిన్ననెమిల క్రాస్ రోడ్డుకు వచ్చాడు. జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ నుంచి మరిపెడబంగ్లా వైపు వెళ్తున్న కారు అతివేగంగా ఢీకొట్టింఇ. దీంతో గాలిలోకి ఎగిరి మల్సూర్ కిందపడడంతో అతడి తలకు బలమైన గాయాలయ్యాయి. కాలు వేళ్లు తెగిపడ్డాయి. అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేటకు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ మహేంద్రనాథ్ సందర్శించి, వివరాలు తెలుసుకున్నారు.

నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం



రైతు ఫిర్యాదుపై విచారణ చేస్తున్న ఏడీ రవి

నేరేడుచర్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రైతు ఫిర్యాదుపై ఫర్టిలైజర్ దుకాణ యజమానిని విచారించామని, రైతుతో మాట్లాడామని విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏడీఏ రవి అన్నారు. పురుగుల మందు పిచికారీ చేయడం వల్ల తాను నష్టపోయానని ఫర్టిలైజర్ దుకాణ నిర్వాహకులపై రైతు ఫిర్యాదు మేరకు సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో సోమవారం వ్యవసాయాధికారులు విచారణ ప్రారంభించారు. నేరేడుచర్ల వ్యవసాయాధికారి కార్యాలయానికి ముకుందాపురం గ్రామ రైతు శ్రవణ్‌తో పాటు, లక్ష్మీవేంకటేశ్వర ఫర్టిలైజర్ డీలర్ ముదిరెడ్డి వెంకటరెడ్డిని పిలిపించి విచారణ చేపట్టారు. ఇరువురి వాదనలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఏడీఏ తెలిపారు. డీలర్ వెంకటరెడ్డి ఏ కంపెనీ సరఫరా చేసిన మందులు రైతుకు ఇచ్చింది వివరాలు సేకరించారు. కంపెనీపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. రైతుకు తగిన న్యాయం చేస్తామని ఏడీఏ రవి తెలిపారు. ఆయన వెంట వ్యవసాయాధికారి జావిద్ ఉన్నారు.

ఏపీ నుంచి హైదరాబాద్‌కు ఇసుక

● మిర్యాలగూడ వద్ద పట్టుకున్న పోలీసులు



మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కిష్టాపురం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఓవర్‌లోడ్‌తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీని ఆపి లోడుకు సంబంధించిన పత్రాలను పరిశీలించగా ఎలాంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా చిన్నగంజం నుంచి హైదరాబాద్‌కు ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో టీఎస్ 05యూడీ1225 నెంబరుగల లారీ డ్రైవర్ బత్తుల రాజును అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. తనిఖీలో పట్టుబడ్డ లారీ నల్లగొండ పట్టణానికి చెందిన రాచకొండ నగేష్‌గౌడ్‌కు చెందినదిగా గుర్తించినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. ఎలాంటి అనుమతి ప్రతాలు లేకుండా ఇసుక అక్రమరవాణాకు పాల్పడుతున్న లారీని సీజ్ చేసి డ్రైవర్ రాజుతోపాటు, సదరు వాహనం యజమాని నగేష్‌గౌడ్‌పై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

పోలీసుల అదుపులో సిగరెట్ దొంగలముఠా?

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ బాలాజీ కిరాణ దుకాణంలో రూ.15లక్షల విలువైన సిగరెట్ల బాక్సులను ఎత్తుకెళ్లిన దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు దొంగల ముఠా సభ్యులను స్థానిక పోలీసులు స్వరాష్ట్రంలోని స్వగ్రామంలో పట్టుకున్నట్లు తెలుస్తోంది. దొంగలను అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సిగరెట్టు బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు మంగళవారం వెల్లడించే అవకాశం ఉంది.

దేవాలయంలో చోరీ

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కుంట్లగూడెంలో పెద్దమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి మెడలోని తులంపావు బంగారు చైన్, పావుతులం ముక్కుపుడక, కిలో వెండి కిరీటం, అరకిలో వెండి ప్లేటు చోరీ చేశారు. ఈ మేరకు దేవాలయ అధ్యక్షులు నరేశ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్లాట్ల కబ్జాపై ఫిర్యాదు

భువనగిరి (కలెక్టరేట్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తమపేరున రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని కబ్జా చేస్తున్నారని, న్యాయం చేయాలని ప్లాట్ల కొనుగోలుదారులు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ప్రైవేట్ బస్సులో యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదుచేసి అదనపు కలెక్టర్‌కు ఆవేదనను వెళ్లబోసుకున్నారు. బాధితులు మాట్లాడుతూ 2011-12లో యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామ రెవెన్యూ పరిధిలోని మహదేవ్ ఎస్టేట్ వెంచరు సర్వేనంబరు 129, 130, 131లలో సత్యనారాయణరెడ్డి అనే వ్యక్తి 600 ప్లాట్లు చేశారని, వాటిలో పలుప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. పూర్తిగా డబ్బులు చెల్లించడంతో రిజిస్ట్రేషన్ అయ్యిందన్నారు. పేరు మార్చుకోకపోవడంతో తిరిగి అతడి పేరునే రికార్డు వస్తుండటంతో ప్లాట్ల హద్దులను నిర్ణయించుకున్నామని, కానీ ఇటీవల కొందరు తమ హద్దులను తొలగించి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బాధితులు కుమారస్వామి, మోహిన్‌ఖాన్, శ్రీరంగం, భాగ్య, మీనాక్షి, పద్మజ, జ్యోతి, దేవేందర్, శోభారాణి శ్రీలత, పలువురు వృద్ధులు, మహిళలు ఉన్నారు.

శరవేగంగా విజయవిహార్ ఆధునికీకరణ

- రూ.5కోట్లతో పూర్తికి కసరత్తు
- సాగర్‌కు రానున్న 140 దేశాల మిస్‌వరల్డ్ పోటీ యువతులు, దేశ, విదేశీ మీడియా ప్రతినిధులు



విజయవిహార్ భవనానికి రంగులు వేస్తున్న కూలీలు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని విజయవిహార్ అతిథి గృహంలో రూ.5 కోట్లతో చేపట్టిన ఆధునికీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మే 7వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే మిస్‌వరల్డ్ పోటీలకు 140 దేశాలకు చెందిన యువతులు, 3 వేల మంది దేశ, విదేశీ మీడియా ప్రతినిధులు హాజరవుతున్నారు. వీరంతా రాష్ట్రంలో వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్నారు. దీనిలో భాగంగా మే 12న నాగార్జునసాగర్‌కు వస్తున్నారు. సాగర్‌లో బుద్ధవనం, జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండను సందర్శిస్తారు. వీరు ఇక్కడ విడిది చేయడానికి వీవీపీ అతిథి గృహం అయిన విజయవిహార్‌ను ఎంపికచేశారు. మిస్‌వరల్డ్ పోటీలకు కేవలం నెల రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఆధునికీకరణ పనులు శరవేగంగా చేస్తున్నారు. పనులను గత నెల 22న పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిలు పరిశీలించారు. విజయవిహార్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి ప్రతిష్ఠను, తెలంగాణ సంస్కృతీ,సంప్రదాయాలను దేశ, విదేశాలకు తెలియపరిచేలా పర్యాటక ప్రాంతాలను తీర్చి దిద్దాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో విజయవిహార్‌లో ప్రస్తుతం స్విమ్మింగ్ పూల్, సరోవర్ విభాగంలో రంగులు అద్దె పనులు చకచక సాగుతున్నాయి. ప్రధాన విభాగంలో రిసెప్షన్‌పైన ఉన్న గదులకు చిప్పింగ్ చేయడం వంటి పనులు చేస్తున్నారు. అంతే కాకుండా డ్రైనేజీ నూతన లైన్లను ఏర్పాటు చేస్తున్నారు.



నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ కాల్వ

20 రోజుల్లో పనులు పూర్తి చేస్తాం

విజయవిహార్ అతిథి గృహం ఆధునికీకరణ పనులను 20 రోజుల్లో పూర్తి చేస్తాం. మిస్‌వరల్డ్ పోటీదారులు సాగర్ సందర్శనకు వచ్చే నాటికి అన్ని పనులు పూర్తి చేస్తాం. ఇప్పటికే సగం పనులు పూర్తయ్యాయి.

శ్రీనివాస్‌రెడ్డి, డీఈ, పర్యాటక శాఖ

వ్యాధి తగ్గినా.. అప్పులు మిగిలాయి

● గత సంవత్సరం మార్చిలో వింత జ్వరాలతో ఇందుగుల అతలాకుతలం ● మూడు నెలల పాటు వైద్య శిబిరం ● గ్రామస్థుల బాధలు వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'



ఇందుగుల గ్రామం

మాడ్గులపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం మార్చి నెలలో నెలకొన్న ప్రతికూల వాతావరణంతో అంతుచిక్కని రోగంతో ఆ ఊరంతా భయాందోళనకు గురైంది. సుమారు మూడు నెలల పాటు గ్రామస్థులు విష జ్వరాలు, ఒళ్లు నొప్పులతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో వారి బాధ వర్ణనాతీతంగా ఉండేవి. గ్రామంలోని ప్రతి కుటుంబంలోనూ ఇద్దరికి చొప్పున జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడ్డారు. గ్రామంలో సుమారు రెండు వేలకు పైగా జనాభా ఉండగా గ్రామంలో జ్వరాలతో బాధపడుతుంటే వైద్యాధికారులు మాత్రం నామమాత్రంగా పరీక్షలు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. గ్రామస్థుల బాధలపై 'వ్యాధి దొరకక.. చికిత్సకు లొంగక' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. రాష్ట్ర, జిల్లా వైద్యాధికారులను అప్రమత్తం చేశారు. దీంతో అధికారులు గ్రామంలో కొన్ని రోజులపాటు వైద్య శిబిరాలు నిర్వహించి మందులను అందజేశారు. హైదరాబాద్ నుంచి జోనల్ అధికారులు, వరంగల్ నుంచి రాష్ట్ర మలేరియా నియంత్రణ అధికారులు వచ్చి సుమారు 400 మంది నుంచి రక్త నమూనాలను సేకరించారు. గ్రామంలోని నీటి నమూనాలను తీసుకొని ల్యాబ్‌కు పంపించగా రక్త నమూనాలో ఎలాంటి వ్యాధి లక్షణాలు లేవని నిర్ధారించారు.

ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి..

గ్రామంలో ఎక్కువ మంది బాధితులు మిర్యాలగూడ, నల్లగొండ పట్టణాలకు వెళ్లి ప్రైవేట్ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకోవడంతో నెగిటివ్‌గా రిపోర్ట్ వచ్చినా వ్యాధి మాత్రం తగ్గలేదు. దీంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అంతుచిక్కని వ్యాధి వ్యాపించడంతో గ్రామస్థులు అయోమయానికి గురయ్యారు. కీళ్ల నొప్పులతోపాటు శరీరం నల్లగా మారడం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపించడంతో మందులు వాడినంత వరకు వ్యాధి తగ్గినా ఆ తర్వాత తిరిగి వ్యాపించిందని అప్పటి గురించి గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. దీంతో తమ వద్ద ఉన్న డబ్బులు ఖర్చు కాగా అప్పులు తెచ్చి మరీ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఒక్కో రోగికి సుమారు రూ.20వేల నుంచి రూ. 25వేల వరకు ఖర్చయింది. వ్యాధి తగ్గినా అప్పులు మాత్రం ఇప్పటికీ తీర్చలేకపోయామని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

గ్రామంలో విస్తృతంగా జ్వరాలు వ్యాపించడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కువగా దోమలు ఉండడంతో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు అన్నారు. గతేడాది తమకు వ్యాపించిన అంతుచిక్కిన వ్యాధితో ఇప్పటికీ గ్రామంలో ఎవరిని కదలించినా 'వామ్మో ఆ నొప్పులా' అని తలుచుకొని ఇప్పటికీ భయపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామంలో ఎలాంటి అలజడి లేదని, ప్రస్తుతం గ్రామస్థులు ఆరోగ్యంగా ఉన్నారని, ఇబ్బందులు ఉంటే వెంటనే తమను సంప్రదించాలని వైద్యులు పేర్కొంటున్నారు.

కొద్దిగా నొప్పులు ఉన్నాయి



గత సంవత్సరం నాకు జ్వరం వచ్చింది. మూడు నెలల పాటు బాధను అనుభవించా. దీంతో నేను ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నా. జ్వరం తగ్గిన తర్వాత కూడా కీళ్ల నొప్పులు, వాపులు మొదలయ్యాయి. ముఖంపై నల్లటి మచ్చలు వచ్చా యి. మళ్లీ వైద్యం చేయించుకోవడంతో రూ.25వేలు ఖర్చు అయ్యాయి. తిరిగి ఇప్పుడు మళ్లీ నొప్పులు కొద్దిగా మోకాళ్ల నొప్పి వస్తుంది. మందులు వాడుతున్నా.

దాసరి సైదులు, ఇందుగుల

ప్రస్తుతం ఎలాంటి జ్వరాలు లేవు



ఇందుగులలో గత ఏడాది మార్చిలో వైద్య శిబిరం నిర్వహించాం. రాష్ట్ర, జిల్లా వైద్యాధికారుల సూచనల మేరకు గ్రామంలో పర్యటించి ఇంటింటికీ తిరిగి జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడిన వారికి మందులు పంపిణీ చేశాం. ప్రస్తుతం గ్రామంలో ఎలాంటి జ్వరం, ఒళ్లు నొప్పుల వంటి వారు ఎవరూ లేరు. ఏదైనా సమస్య ఉంటే తమను వెంటనే సంప్రదించాలి.

● ఫిర్దోస్, మెడికల్ ఆఫీసర్, ఇందుగుల

ఎడ్ల పందేలకు పెరుగుతున్న ఆదరణ

తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు ప్రారంభించిన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



ఉమ్మడి రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే జాతరలు, ఉత్సవాల్లో ఎడ్ల పందేలకు ఆదరణ పెరుగుతోందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేల పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏటా శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పందేల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, పల్నాడు, కృష్ణా, తెలంగాణలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన ఎనిమిది ఎద్దుల జతలను సంబంధిత యజమానులు తీసుకొచ్చారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మార్కెట్ డైరెక్టర్ శాగం మంగమ్మ, ఏసీపీ చవ్వా శంకర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శాగం నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శాగం పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, గురునాథం, బద్దెల వెంకన్న, లాలునాయక్, భద్రినాయక్, చింతల చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పొగాకు సాగు లాభాలు బాగు

పదేళ్లుగా సాగుచేస్తున్న రైతులు ● క్వింటా రూ.15వేలకు విక్రయం



తిమ్మాపురం వ్యవసాయ క్షేత్రంలోని షెడ్డులో ఆరబెట్టిన పొగాకు

అర్వపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రైతులు పొగాకు సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం, అడివెంల, కొమ్మాల, కోమటిపల్లి, కుంచమర్తి గ్రామాలకు చెందిన రైతులు 350 ఎకరాల్లో ఐటీసీ కంపెనీ సహకారంతో పొగాకు తోటలు సాగు చేస్తున్నారు. నీరు తక్కువగా ఉండడంతో రైతులు పొగాకు తోట వైపు మొగ్గు చూపుతున్నారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన వేములకొండ వెంకన్న అనే రైతు పదేళ్లుగా, అదే గ్రామానికి చెందిన బొల్లం వెంకటేశ్వర్లు ఐదేళ్ల నుంచి ఐదు ఎకరాల్లో పొగాకు తోటలను సాగు చేస్తున్నారు. ఎకరానికి రూ.20వేలు పెట్టుబడులు పెడతారు. ఎక్కువ మొత్తంలో రసాయన మందులు వాడటం లేదు. పెట్టుబడి తక్కువగా ఉండి దిగుబడి ఎక్కువగా రావడంలో రైతులు తోటల వైపు మొగ్గు చూపారు. ఈ పంట 90రోజుల్లో చేతికి వస్తుంది. 15 రోజులకోసారి పొగాకు తోటకు నీరు పెట్టి సాగు చేస్తున్నారు. వ్యవసాయ క్షేత్రం వద్ద షెడ్డును ఏర్పాటు చేసి పొగాకు కోత కోసి పది రోజుల పాటు ఆరబెట్టి విక్రయిస్తారు. ఎకరానికి 12క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఐటీసీ కంపెనీ ప్రతినిధులు రైతులకు పొగాకు తోటపై సూచనలు, సలహాలు ఇచ్చి వ్యవసాయ క్షేత్రాల వద్దకు వచ్చి క్వింటాకు రూ.15,500 కొనుగోలు చేస్తున్నారు.

పొగాకు సాగుతో లాభాలు ఆర్జిస్తున్నాం



ఐదేళ్లుగా ఐదు ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నాం. క్వింటాకు రూ.15,500 వస్తున్నాయి. కంపెనీ సూచనల మేరకు పొగాకు తోటలను సాగు చేస్తున్నాం. పెట్టుబడులు పోనూ లాభాలు ఆర్జిస్తున్నాం.

బొల్లం వెంకటేశ్వర్లు రైతు, తిమ్మాపురం గ్రామం, జాజిరెడ్డిగూడెం మండలం

కొత్త ఎమ్మెల్సీల ఉత్సాహం



ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసి బయటకు వస్తున్న నెల్లికంటి సత్యం



నల్లగొండ జిల్లా సీపీఐ కార్యదర్శి నెల్లికంటి సత్యం సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన అద్దంకి దయాకర్ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. వారికి కాంగ్రెస్, సీపీఐ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

నేత్రపర్వంగా రాములోరి పట్టాభిషేకం



హారతి సమర్పిస్తున్న అర్చకుడు



యాదగిరిగుట్ట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో రాములోరి పట్టాభిషేకం సోమవారం వైభవంగా నిర్వహించారు. నిత్యారాధనల అనంతరం తిరువీధిసేవ చేపట్టి మూలమంత్ర జపాలు, దశశాంతి, పంచసూక్త పారాయణాలతో అభిషేకాలు, ఆధ్యాత్మ రామాయణ పారాయణం అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. పట్టాభిషేకం మహోత్సవ విశిష్టతను ఆలయ సిద్ధాంతి గౌరిభట్ల సత్యనారాయణశర్మ, ప్రధాన పూజారి నరసింహమూర్తి భక్తులకు వివరించారు. అర్చకుల వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య అభిషేక మండపంలోని సువర్ణ కలశాలలో నింపి స్వర్ణ సింహాసనంపై అధిష్ఠింపజేసి పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని యాగశాలలో సహస్రనామార్చనలు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వితరణ జరిపారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, ఈవో ఏపూరి భాస్కర్‌రావు, ఉప కార్యనిర్వాహణ అధికారి దోర్బల భాస్కరశర్మ, ఏఈ వోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రమేష్‌బాబు, రఘు, పర్యవేక్షకులు నాగుల మహేష్, రామరావునాయక్ తదితరులు పాల్గొన్నారు.

శివకేశవులకు విశేష పూజలు

శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.19,44,856ల ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో భక్తవత్సలుడి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వయంభువునికి పంచామృతాలతో పంచసూక్త విధానంగా అభిషేకాలు చేపట్టారు. ఉదయం యాగశాలలో సుదర్శన నారసింహ హోమాలు జరిగాయి. ఉత్సవ మూర్తులను ఆలయ ప్రదక్షిణ చేయించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	516.30
టీఎంసీలు	142.6157
ఎడమకాల్వకు నీటి విడుదల	4,881
కుడికాల్వకు	2,053
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	8,734

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.88 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	624.40 అడుగులు
టీఎంసీలు	0.76
కాల్వలకు విడుదల	26.19 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	620.94 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	55.09క్యూసెక్కులు

కంపచెట్లు పెరిగి.. రక్షణ గోడలు లేక

● పూర్తిస్థాయిలో మరమ్మతులకు నోచని ఏఎమ్మార్పీ ప్రాజెక్టు ● మొక్కుబడిగా కంపచెట్లు తొలగింపు ● మరమ్మతులు పూర్తయ్యేదెన్నడో?



పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జంటనగరాలకు, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సాగు, తాగునీరు అందించే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు మరమ్మతులు పూర్తిస్థాయిలో జరగడంలేదు. గతంలో రక్షణ గోడ కుంగడంతో మోటర్లను ఆపివేసి ఇసుక బస్తాలు వేసి నీరులీకేజీ కాకుండా చేశారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని అధికారులు ఆదేశించినా ముందుకు సాగడం లేదు. నాగార్జునసాగర్ నీటిమట్టం ప్రస్తుతం 516అడుగులు ఉంది. 510అడుగులకు దిగువకు చేరితే అవసరమైన నీటిని మోటర్ల ద్వారా ఎత్తిపోసి హైదరాబాద్ జంట నగరాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు తాగునీరు అందించడానికి హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు చర్యలు చేపట్టనుంది. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పుట్టంగండి జీరో పాయింట్ వద్ద 2024లో రూ.3కోట్లతో పనులు చేపట్టి 600 హెచ్‌పీ సామర్థ్యం గల ఐదు మోటర్లు, 300 హెచ్‌పీ సామర్థ్యం గల మరో ఐదు మోటర్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా సాగర్ బ్యాక్ వాటర్ నుంచి రోజుకు 900క్యూసెక్కుల నీటిని పుట్టగండి అప్రోచ్ కెనాల్‌లోకి ఎత్తిపోశారు. ప్రస్తుతం సాగర్ నీటిమట్టం 516అడుగులు ఉందని ఇప్పటివరకు ఇబ్బంది లేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. 2016, 2017, 2018, 2019, 2024లో వరుసగా మోటర్ల ఏర్పాటు చేసి సాగర్ నీటి మట్టం 500అడుగుల వరకు ఉన్నా నీటిని ఎత్తిపోశారు. కొన్ని సందర్భాల్లో మోటర్లకు నీరు అందకపోవడంతో నదిలో కాల్వ తవ్వి నీటిని పుట్టగండి మోటర్లకు అందించారు. ప్రస్తుతం నాలుగు మోటర్ల ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని అక్కంపల్లి రిజర్వాయర్ తరలిస్తున్నారు. అక్కడి నుంచి జంటనగరాలకు 525 కూసెక్కులు, మిషన్‌భగీరథ 45 క్యూసెక్కుల నీటిని, పానగల్ రిజర్వాయర్‌కు 1100క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

రూ.9 కోట్లతో ప్రతిపాదనలు

పుట్టంగండి పంప్‌హౌస్, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చుట్టూ కంపచెట్లు ఏపుగా పెరిగి నీరు లీక్ అవడంతో గత సంవత్సరం రూ.9కోట్లతో కంపచెట్లను తొలగించారు. ఇంకా పూర్తిస్థాయిలో పనులు పూర్తికాలేదు. గత సంవత్సరం మొదటి యూనిట్ మరమ్మతులకు గురికావడలో రూ.1.5కోట్లతో మరమ్మతులు చేపట్టారు. గత సంవత్సరం నిర్వహణ కోసం జెన్‌కో అధికారులు రూ.8.84 కోట్లతో ప్రతిపాదనలు చేయగా అది మార్చితో ముగిసింది. 2025-2026 సంవత్సరానికి నిర్వహణ కోసం రూ. రూ.9 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు.

చేయాల్సిన పనులు

గతంలో పుట్టంగండి నుంచి అక్కంపల్లి రిజర్వాయర్ వరకు 12 కిలోమీటర్ల దూరం కెనాల్‌కు లైనింగ్ మురమ్మతుల కోసం రూ.51 కోట్లు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రాలేదు. దీంతో పనులు ఇంకా ప్రారంభించలేదు. అలాగే ప్రధాన కాల్వలకు ఉన్న లింక్ కెనాల్‌లు కంపచెట్లతో నిండి ఉన్నాయి. దీంతో ఆయకట్టు చివరి వరకు నీరు చేరక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వల్లో పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉంది. అలాగే కాల్వల లైనింగ్ మరమ్మతులు చేయాల్సి ఉంది. అదే విధంగా పూర్తిస్థాయిలో రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంది.

పెంపకందారులకు పరిహారం ఇవ్వాలి

భువనగిరి రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెల, మేకల పెంపకం దారుల యజమానులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) యాదాద్రిభువనగిరి జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీఎంపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూగ జీవాలకు గ్రామాల్లో నీటి తొట్లు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ భూముల్లో తుమ్మ చెట్లను ఉచితంగా మేపుకోవడానికి అవకాశం ఇవ్వాలని పెంపకం దారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాక జహంగీర్, మద్దెపురం బాలనర్సింహ, రాజలింగం, బాలేశ్వర్, అశోక్, యాదగిరి, కృష్ణ పాల్గొన్నారు.

వేసవిలోనూ కోనేరుకు జలకళ



దేవరకొండ ఖిల్లాపై ఉన్న కోనేరులో నిండుగా ఉన్న నీరు

దేవరకొండ ఖిల్లాతోపాటు కోనేరుకు సుదీర్ఘ చరిత్ర ఉంది. వేసవి, కరువు పరిస్థితుల్లోనూ కోనేరు ఎండిన సందర్భాలు లేవు. 13వ శతాబ్దంలో రేచర్ల పద్మనాయక వెలమరాజులు దేవరకొండ దుర్గాన్ని రాజధానిగా చేసుకొని 1326 నుంచి 1475 వరకు 149 సంవత్సరాలు పాలించారు. 770 సంవత్సరాలకు పూర్వం ఏడు కొండలు కలుపుతూ దేవరకొండ దుర్గాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఎంతటి కరువు వచ్చినా కోనేరు ఎండిన సందర్భాలు లేవు. కొబ్బరినీటిని తలపించే విధంగా కోనేరు నీరు ఉండడంతో ఖిల్లాను సందర్శించడానికి వస్తున్న విదేశీయులు, పర్యాటకులు, భక్తులు, గొర్రెల కాపర్లు ఖిల్లాలోని కోనేరు నీటిని తాగుతారు. కోనేరుకు ఎక్కడి నుంచి నీరు వస్తుందో ఇప్పటికీ అంతుచిక్కని రహస్యం.

● దేవరకొండ, ఆంధ్రజ్యోతి

బతుకు పోరాటం







మనుషులకైనా, జీవులకైనా బతుకు పోరాటం తప్పదు. తమను తాము కాపాడుకునే సమయంలో ఎంతటి బలవంతుడినైనా ఎదిరించే ధైర్యం వస్తుంది. శక్తినంతా కూడగట్టి పోరాడేందుకు సిద్ధమవుతారు. ఇలాంటి దృశ్యమే నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని కతాల్‌గూడెం గ్రామంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. గాయపడిన ఓ ఎలుకను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన రెండు కాకులతో ఓ ఎలుక శివంగిలా పోరాడింది. ప్రత్యర్థి తనకన్నా శక్తివంతులని తెలిసినా తన సహచర ఎలుకను హత్తుకొని కాకుల బారిన పడకుండా ధైర్యంగా ఎదుర్కొంది. కాకులను దగ్గరకు రానివ్వకుండా పోరాడింది.

– ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటో గ్రాఫర్ నల్లగొండ.







బీఐఎస్‌పై అవగాహన ఉండాలి

మోత్కూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీఐఎస్(బ్యూరో ఇండియన్ స్టాండర్డ్)పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల సంఘాల రాష్ట్ర కార్యదర్శి పోచం సోమయ్య అన్నారు. పరిశ్రమలకు ఇచ్చే నాణ్యత పరమైన ఐఎస్ఐ సర్టిఫికెట్లతో వినియోగదారులకు చేకూరే ప్రజయోజనాలపై వారికి అవగాహన కల్పించాలని బీఐఎస్ అవగాహన కార్యక్రమం చేపట్టిందన్నారు. సోమవారం మోత్కూరు ఇన్‌చార్జి తహసీల్దార్ ఉపేందర్, మునిసిపల్ కమిషనర్ సతీష్‌కుమార్‌కు బ్రోచర్లు అందజేశారు.

గ్రంథాలయానికి ఉచిత పుస్తకాలు అందజేత

ఆలేరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జనని స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మైదం భాస్కర్ ఆధ్వర్యంలో ఆలేరు పట్టణంలోని శాఖ గ్రంథాలయానికి జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పుస్తకాలను సోమవారం గ్రంథాలయ అధికారి జంపయ్యకు అందచేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు గ్రంథాలయాన్ని సంప్రదించి, ఈ పుస్తకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జూకంటి సంపత్, సురేశ్, మైదం రాజేశ్, హరీష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో నీటి సమస్య రాకుండా అధిగమిస్తామని, వాటిని నివారించడానికి ముందొస్తుగా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని యాదగిరిగుట్ట ఎంపీడీవో నవీన్‌కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల్లో మొత్తం 59 ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులు, సింగిల్ ఫేజ్ బోర్లు 24, 3ఫేజు బోర్లు 94, చేతి పంపులు మొత్తం 76 ఉండగా అందులో పూర్తిగా ఎండిపోయినవి 36 ఉన్నాయని తెలిపారు. గ్రామాలకు మిషన్ భగీరథ ద్వార ప్రతీ రోజు రావాల్సిన నీరు 2.16 ఎంఎల్‌డీ ఉండగా ప్రస్తుతం 1.7 నీరు సరఫరా అవుతోందని దానికి తోడుగా గ్రామ పంచాయతీల బోర్ల ద్వారా వచ్చేనీరు కలిపి ప్రజలకు నీటి సమస్య రాకుండ చర్యలు తీసుకుంటున్నామని తెలిపార. సోమవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో ఆయన మండలంలోని ప్రజల ద్వారా సమస్యలను తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

-(ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట రూరల్)



నవీన్‌కుమార్, ఎంపీడీవో, యాదగిరిగుట్ట

నీటి సరఫరాలో ఇబ్బందులున్నాయి

-భీమగాని నర్సింహగౌడ్, పెద్దకందుకూర్

ఎంపీడీవో: మిషన్ భగీరథ నీటి సరఫరాపై సంబంధిత ఏఈతో మాట్లాడతాం. నూతన పైపుల ద్వారా నీటి సరఫరా చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం.

మురికినీరు పొలాలకు వస్తోంది

-కల్లెపల్లి మహేందర్, పెద్దకందుకూర్

ఎంపీడీవో: గ్రామంలోని మురికినీరు బయటకు వెళ్లకుండా ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మాణాలు చేయిస్తాం. ప్రస్తుతం మురికినీరు వరిపొలాలకు వెళ్లకుండా ప్రభుత్వ భూమిలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాం.

కాచారంలో నీటి ఎద్దడి ఏర్పడింది

- వైద్యుల తిరుపతి, కాచారం

ఎంపీడీవో: ఎండిపోయిన బోర్లకు మరమ్మతులు చేయిస్తాం. అవసరమైతే అద్దె బోర్లు తీసుకుని ప్రజలకు నీటి సమస్య రాకుండా చూస్తాం.

నీటి వృధాను అరికట్టండి

-గోపగాని ప్రసాద్‌గౌడ్, 10వ వార్డు, మల్లాపురం

ఎంపీడీవో: మల్లాపురంలో సంబంధిత అధికారులను పంపించి కొత్త నల్లాలు బిగిస్తాం. నీటి వృధాను అరికడతాం.

వంగపల్లిలో నీటి కొరత

-రేగు బాలనర్సయ్య, వంగపల్లి

ఎంపీడీవో: పైనుంచి మిషన్‌భగీరథ నీరు తక్కువగా సరఫరా కావడంతో కొంత వరకు ఇబ్బంది అవుతోంది. అవసరమైతే అద్దె బోర్లతో సమస్యను పరిష్కరిస్తాం.

బోరు మోటార్లు పోయడంలేదు

-బుడిగె నర్సింగ్‌రావు, మాసాయిపేట

ఎంపీడీవో: మరమ్మతులో ఉన్న బోర్లకు త్వరలో మరమ్మతులు చేయించి, ఎస్సీ కాలనీకి నీరు సరఫరా చేయిస్తాం.

ఆర్వో ప్లాంటు పనిచేయడం లేదు

-గడ్డమీది రవీందర్‌గౌడ్, పెద్దకందుకూర్

ఎంపీడీవో: గ్రామంలో ఎండిపోయిన బోర్లకు మరమ్మతులు చేస్తాం. ఆర్వో ప్లాంట్‌కు మరమతులు చేసి నీటి సమస్య రాకుండా చూస్తాం.

వాటర్‌మన్‌పై చర్యలు తీసుకోవాలి

-మాసాయిపేట, యాకూబ్

ఎంపీడీవో: వాటర్‌మన్‌ను గట్టిగా మందలిస్తాం. వినకపోతే చర్యలు తీసుకుంటాం.

పైప్‌లైన్ వేశాం..డబ్బులు ఇప్పించండి

-కాల్నే భాస్కర్, దాతరుపల్లి

ఎంపీడీవో: మైలారిగడ్డ తండాకు అయిన ఖర్చులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, డబ్బులు త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఆరోగ్యమే మహాభాగ్యం



చీమలకొండూరు వృద్ధాశ్రమంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జయ శ్రీ, డాక్టర్ మూల్యాంక

భువనగిరి రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని సజావుగా జీవించేందుకు ఆరోగ్య పరంగా మెళకువలు పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గాదెపాక శంకర్ అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ గంధం నాగరాజు, జిల్లా కోర్టు బార్ అసొసియేషన్ సెక్రటరి డాక్టర్ బొల్లేపల్లికుమార్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో భువనగిరి మండలంలోని అనాజీపురం, చీమలకొండూరు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వయోవృద్దుల ఆశ్రమంలో వయోవృద్దులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వైద్యులు డాక్టర్ జయ శ్రీ, డాక్టర్ మూల్యాంక, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు దిడ్డి బాలాజీ, జంపాల అంజయ్య, ఎం బాలేశ్వర్, ఆశ్రమ నిర్వహకులు బెజ్జాల వెంకటేశ్వర్లు, డాక్టర్ రామకృష్ణ, బి హరీశ్, డాక్టర్ విజయ, కస్తూరి, సబిత, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రం విడుదల చేస్తున్న బీజేవైఎం నాయకులు తరుణ్‌రెడ్డి తదితరులు

బీబీనగర్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): బీబీనగర్‌లో ఈనెల 13వ తేదీన నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువతీయకులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి తరుణ్‌రెడ్డి సూచించారు. సోమవారం బీబీనగర్ మండల కేంద్రంలో స్థానిక బీజేవైఎం నేతలతో కలిసి జాబ్‌మేళా ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీబీనగర్ పట్టణంలోని లిటిల్‌బర్డ్ హైస్కూల్ పక్కన పోలీస్ క్వార్టర్స్ సమీపంలో ఈనెల 13న మేగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొనబోతున్న ఈమేళాలో 5వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. ప్రత్యేకంగా ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు స్పాట్‌ఆఫర్ లెటర్‌ను అదే రోజు అందిస్తారని తెలిపారు. ముఖ్యంగా ఐటీ, ఐటీఈఎస్, కోర్ రంగాలు, ఫార్మా, బ్యాంకింగ్ హాస్పిటాలిటీ నర్సింగ్, రిటైన్ ఎఫ్ఎం సీజీ, మేనేజ్‌మెంట్ తదితర విభాగాల్లో నైపుణ్యంతో కూడినవి, నైపుణ్యం లేని ఉద్యోగాలు ఇస్తారని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ విద్యా అర్హత నైపుణ్యాలను ప్రదర్శించి ఉద్యోగాలు పొందాలని సూచించారు. ఆయన వెంట బీజేవైఎం నాయకులు పొట్ట నవీన్‌కుమార్, దేవరుప్పల శ్రీధర్, పాండు, పరిగెల రవి, బాలు, విజయ్, శ్రీను, వెంకట్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

భువనగిరి రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): భువనగిరి మండల వ్యాప్తంగా ఉన్న భూ పంపిణీపై నిషేధం ఎత్తివేసి పేద రైతులకు వ్యవసాయ భూములు, పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలు, దళితులు, గిరిజనులు తదితర వర్గాల ప్రజలకు భూములను పంపిణీ చేసి, వారి ఆర్థిక పరిపుష్టికి పాలకులు చొరవ చూపాలన్నారు. మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో 331 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు సాగు భూమి, ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే విధంగా చొరవ చూపాలన్నారు. లేనట్లయితే సీపీఎం ఆధ్వర్యంలో ఎర్ర జెండాలు పాతి పేదలకు పంపిణీ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, నాయకులు అశోక్, నాగమణి, కూకుట్ల కృష్ణ, లక్ష్మయ్య, మల్లయ్య ఉన్నారు.

టీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బారికేడ్ల ఏర్పాటు

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మార్కండేయనగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై ప్రమాదాల నివారణకు టీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు తడక రమేష్ స్వచ్ఛందంగా బారికేడ్లను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నిలయంగా మారిన మార్కండేయ నగర్, ప్రకాష్ నగర్ కాలనీల్లో తన సొంత నిధులతో బారికేడ్లను ఏర్పాటు చేసనట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బోగ భానుమతి విష్ణు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జెల్ది నర్సింహ, పోచంపల్లి పద్మశాలి కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, మాజీ అధ్యక్షురాలు మెరుగు శశికళ, డైరెక్టర్లు గుండు రాజేశ్వరి, గుర్రం హేమలత, స్థానిక నాయకులు కూరపాటి బాబు, వెంకటేష్, జోగు శ్రీనివాస్, పెండెం పాండుపాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో ఐఐటీ ఉపయోగకరం

వలిగొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఐఐటీ ఎంతో ఉపయోగపడుతుందని మండల విద్యాధికారి భాస్కర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో గాయత్రి పాఠశాల్లో ఐఐటీ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ, ఒకప్పుడు ఐఐటీ పట్టణ ప్రాంతానికి పరిమితమై చాలా వేగంతో కూడికున్నదిగా ఉండేదని అన్నారు. నేడు ఈ ఐఐటీ మండల స్థాయికి తీసుకొచ్చిన ఘనత గాయత్రి పాఠశాలకు దక్కిందని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నరహరి, వైస్ చైర్మన్ మురళీధర్‌రెడ్డి, కరస్పాండెంట్ భీమిడి యాదిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కొంతం బిక్షపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలకూర వెంకటేశం ప్రిన్సిపాల్ అనురాధ, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

వలిగొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): యువకులు మత్తు పదర్థాలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కవిడే సురేష్, మండల అధ్యక్షుడు ద్యానబోయిన యాదగిరి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ యుగేందర్‌గౌడ్ చేతుల మీదుగా యువచైతన్య సైకిల్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏప్రిల్ 14 నుండి 20 వరకు 250 కిలోమీటర్లు యువచైతన్య సైకిల్ యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగులు సాగుతున్నాయని అన్నారు. 17 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల లోపు కొందరు యువకులు మత్తుకు బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శ్మశానవాటికలో విశ్రాంతి షెడ్డు ప్రారంభం

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కనుముకుల గ్రామంలోని శ్మశానవాటికలో విశ్రాంతి షెడ్డును తన సొంత నిధులు రూ. 1.30లక్షలతో పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ కర్తలు, మాజీ జడ్పీటీసీ కోట పుష్పలతా మల్లారెడ్డి నిర్మాణం చేయించారు.



షెడ్డును ప్రారంభిస్తున్న మాజీ జడ్పీటీసీ పుష్పలతమల్లారెడ్డి

సోమవారం షెడ్డును వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోట అంజిరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, మాజీ ఉపసర్పంచ పాక నర్సింహ, నాయకులు కోట సత్తిరెడ్డి, సామల నర్సింహారెడ్డి, యాదిరెడ్డి పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

మోత్కూరు/అడ్డగూడూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు విక్రయించి, ఆర్థికంగా నష్టపోవద్దని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు కోరారు. సోమవారం మండలంలోని పాటిమట్లలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు తొందర పడకుండా నాణ్యత ప్రమాణాలకనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ2320 పొందాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు రాచకొండ బాలరాజు, పేలపూడి సత్యనారాయణచౌదరి, రాములు, ఐకేపీ కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు. మోత్కూరు సింగిల్ విండో ఆధ్వర్యంలో ఆ సంఘం పరిధిలోని పొడిచేడు, అనాజిపురం, కప్రాయపల్లి, రహీంఖాన్‌పేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆ సంఘం చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సంఘం సీఈవో కె.వరలక్ష్మీ స్థానిక నాయకులు, సింగిల్ విండో డైరెక్టర్లు పాల్గొన్నారు.

● అడ్డగూడూరు మండలంలోని జానకీపురం, చిర్రగూడూరు గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి సరైన తేమశాతం వచ్చేలా చూసుకుని, నిర్వాహకులకు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం అడ్డగూడూరు మండలంలోని జానకీపురం గ్రామానికి చెందిన అంబటి రామచంద్రు ఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. అలాగే పేదలకు కడుపు నిండా నాణ్యమైన భోజనం అందించమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్నదానం చేసిన కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను ఎమ్మెల్యే మందుల సామేలు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో శంకరయ్య, ఏవో పాండురంగాచారి, సీఈవో వెంకటేశ్వర్లు, మోత్కూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మనగోటీ జోజి, డైరక్టరు బాలెంల విద్యాసాగర్, సినియర్ నాయకులు కోట విద్యాసాగర్‌రెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.



జానకిపురంలో అన్నదాతలకు నూతన వస్త్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సామేలు

పేదవాడి క్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 7: (ఆంధ్రజ్యోతి) ప్రతి పేదవాడు క్షేమంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మండలంలోని సింగారం తాజా మాజీ సర్పంచ్ జామ యాదయ్య అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ ని సోమవారం గ్రామస్తుల సమక్షంలో ప్రారంభించారు. ప్రభుత్వం కల్పించిన సదవకాశాన్ని రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సన్న బియ్యం పంపిణీ సందర్భంగా రేషన్ దుకాణాన్ని మామిడి తోరణాలతో అలంకరించారు. స్వీట్లు పంపిణీ చేశారు. ప్రతీ పేద కుటుంబం ఆకలి తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యాన్ని ప్రజలంతా వాడుకోవాలని సూచించారు. గ్రామస్తులు చంద్రమౌళి, ప్రభాకర్‌రెడ్డి, కిరణ్, లక్ష్మీనారాయణ, రాములు, ఇస్సాక్, మధుకర్, రాజేష్, డీలర్ ఎం. విజయతోపాటు మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా పట్టాభిషేక మహోత్సవం

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): : పట్టణంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో శ్రీసీతారామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలు ధరింపజేసి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తాంజనేయ స్వామివారికి మంగళపల్లి రాజారమేష్ 500 గ్రాముల వెండి గాయత్రిని బహూకరించారు. ఈ ఉత్సవాల్లో దేవాలయం అధ్యక్షుడు కడవేరు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తడక వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు భారత వాసుదేవ్, మాజీ కౌన్సిలర్ బోగ భానుమతి విష్ణు, ఆలయ ఉపాధ్యక్షుడు బోగ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



నారాయణపురంలో రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ పట్టణంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్సవాలకు భక్తులు వేలాదిగా తరలి రావడం హర్షనీయమని దేవస్థాన కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి అన్నారు. స్థానిక శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవాలు సోమవారం ఉత్సవ విగ్రహాల చక్రస్నానంతో ముగిశాయి. చైర్మన్ మురళి, దేవస్థానం ధర్మకర్తలు కామిశెట్టి చంద్రశేఖర్, గుర్రం వెంకటేశం, తూర్పాటి నర్సింహ, వర్కాల వెన్నెల, ప్రధాన అర్చకుడు పెద్ది సుధాకర్ శర్మ, కమిటీ మాజీ ప్రధానకార్యదర్శి సామిడి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వడ్డేపల్లి రాములు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలి

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ శక్తిని నిర్మాణాత్మకమైన పనుల్లో వినియోగించాలని, విభిన్నంగా బాధ్యతాయుతంగా సరైన మార్గంలో ఆలోచించాలని 'విజ్ఞాన్' సంస్థల చైర్మన్ డా.లావు రత్తయ్య విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామశివారులోని విజ్ఞాన్ యూనివర్సిటీ లో స్టూడెంట్ అఫైర్స్ ఆధ్వర్యంలో జరిగిన కౌన్సిలింగ్ సమావేశంలో ఆయన విద్యార్థులనుద్ధేశించి మాట్లాడుతూ విద్యార్థులు సాధ్యమైనంత వరకు వాహనాల వినియోగాన్ని తగ్గించాలన్నారు. సెల్‌ఫోన్ వాడకాన్ని కచ్చితంగా పరిమితం చేయాలని సూచించారు. కేవలం విద్యలోనే గాక, సమాజంలో మంచి వ్యక్తులుగా ఎదగాలని అన్నారు. సమావేశంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ఎం.సుబ్బారావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహనీయుల ఉత్సవాలు

భువనగిరి గంజ్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాతగా బడుగు బలహీన వర్గాల మహనీయుడు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అని సాంస్కృతిక ప్రజా వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ జి.రాములు అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మహనీయుల ఉత్సవాలు రెండోవ రోజు కేవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో కొనసాగాయి. ఉత్సవాలలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్నంపట్ల కృష్ణ, బట్టు రాంచంద్రయ్య, సురుపంగ శివలింగం, బర్రె జహంగీర్, కొండమడుగు నరసింహ, బర్రె సుదర్శన్, ఇటుకల దేవేందర్, అందె సాయి, బసాని మహేందర్, ఈరపాక నరసింహ, కర్తాల శ్రీను, సురుపంగ చందు, మాటూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వృత్తిదారుల సదస్సును విజయవంతం చేయాలి

రామన్నపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 8వ తేదీన మండల కేంద్రంలో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు అయినా రజకులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నారు. పాలకవర్గాలు రజకుల అభివృద్ధిని పక్కన పెట్టి మాటలతో మోసగిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో రజక వృత్తిదారులకు తగిన నిధులు కేటాయించలేదన్నారు. బీసీ కార్పొరేషన్‌కు కూడా తగిన విధులు కేటాయించకపోవడంతో రజక యువతకు కార్పొరేషన్ రుణాలు అందని ద్రాక్షలా మారిందన్నారు.

కష్టపడిన వారందరికీ బీజేపీలో గుర్తింపు

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 7, (ఆంధ్రజ్యోతి): బీజేపీలో కష్టపడి పనిచేసిన వారందరికీ గుర్తింపు ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్, జిల్లా కార్యదర్శి వైజయంతి అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలో పలు వార్డులలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా సహజ హితం, జాతీయ సమైక్యత కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కర్రె ప్రవీణ్, ఆకుల చంద్రమౌళి, మాజీ మండల అధ్యక్షుడు గుంటిపల్లి సత్యం, నాయకులు జిల్లా భానుచందర్, బందారపు మల్లేశంగౌడ్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చీర్క సురేశ్ రెడ్డి అన్నారు. మండలంలోని గౌస్‌నగర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు నల్లమాసు దానయ్య, బి మోహన్ రెడ్డి, కృష్ణ, కుమార్, పాండు, మధుసూదన్ రెడ్డి, సాయి రెడ్డి, కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

వలిగొండ: దేశంలో సుస్థిరపాలన బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. నాయకులు రాచకొండ కృష్ణ, మండల నాయకులు అనిల్‌కుమార్, వెంకటేశం, శివకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



యాదగిరిగుట్టలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మోత్కూరు : బీజేపీ 45వ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం (11వ బూత్)లో బీజేపీ జెండా ఎగురవేశారు. కందుకూరి ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల, రైల్వేబోర్డు మాజీ సభ్యుడు కొణతం నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

అద్దెకివ్వబడును

(5వపేజీ తరువాయి)

పలువురు చిరు, మధ్యతరగతి వ్యాపారులు దుకాణాలను ఖాళీ చేస్తున్నారు. కానీ తిరిగి నూతన దుకాణాలు ప్రారంభించే వారు తగ్గుతున్నారు. దీంతో మడిగెలు ఖాళీగా ఉండటంతోపాటు పట్టణంలో వ్యాపార, కొనుగోలు అవకాశాలు తగ్గుతున్నట్లు పలువురు వాపోతున్నారు. ఇదే తరహా పరిస్థితి పట్టణంలోని నల్లగొండ రోడ్డు, జగదేవ్‌పూర్ రోడ్డుతోపాటు బస్తీల ప్రధాన రహదారులవెంట క్రమేపీ పెరుగుతోంది. దీంతో పలు కారణాలతో రహదారులవెంట పెరుగుతున్న టూలెట్ బోర్డులతో పట్టణంలో వ్యాపార అవకాశాలు తగ్గి భువనగిరి బ్రాండ్ ఇమేజ్‌పై ప్రభావం చూపే ప్రమాదం ఉంటుందని పట్టణవాసులు ఆందోళనకు గురువుతున్నారు. అదే సమయంలో దుకాణాలు ఖాళీ చేస్తున్న వ్యాపారులు ఉపాధిని కోల్పోయి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. భవన యజమానులు కూడా రుణాల ఈఎంఐలు సకాలంలో చెల్లించక బ్యాంకు నోటీసులు అందుకుంటున్నారు. అన్నివర్గాల నష్ట నివారణకు భవన యజమానులు, వ్యాపారులు, కొనుగోలుదారులు సమన్వయం పాటించాలని స్థానికులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలేవీ?


(5వపేజీ తరువాయి)

యాసంగిలో వరి పంటను సాగుచేశారు. వరి కోతలు కోసిన రైతులు కేంద్రానికి ధాన్యం తెచ్చినా, అవి ప్రారంభం కాకపోవడంతో తప్పని పరిస్థితిలో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వారు అడిగిన ధరకు రైతులు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి స్థలాల సమస్య ఉన్నా, సమస్యలు పరిష్కరించే విధంగా ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారా? లేదా? అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

క్వింటాకు రూ.1700 మాత్రమేనా?

గుండాల మండలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడాన్ని గుర్తించిన దళారులు వారు చెప్పిందే వేదంలా రైతులను నిలువునా దోచుకుంటున్నారు. కనీస మద్దతు ధర రూ.2300 ఉంటే రూ.1700కు కొనుగోలు చేస్తున్నారు. నూటికి రూ.2 కమీషన్‌తోపాటు బస్తాకు రెండు కిలోలు అదనంగా తీసుకోవడంతోపాటు హమాలీ చార్జీలు అన్ని లెక్కిస్తే సుమారు రూ.100 వరకు నష్టపోయి రూ.1600 మాత్రమే చేతికొస్తున్నాయి. దీంతో రైతులు క్వింటాకు రూ.700 వరకు నష్టపోతున్నారు.


ధాన్యం తెచ్చి 15 రోజులు అవుతోంది



గుండాల మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి 15రోజులు అవుతుంది. అధికారులు త్వరగా ధాన్యం కొనుగోలు చేపట్టాలి. ప్రతీ రోజు ఆకాశం మేఘావృతం అవుతుండడంతో వర్షానికి ధాన్యం తడిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

-దేవనబోయిన మంజుల, గుండాల

రైతులను ఆదుకోవాలి



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. వరి కోయడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటివరకు వరి కోసిన రైతులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు రూ.1700కు విక్రయించారు. ఖర్చులు పోను రూ.1600 చేతికొచ్చాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

-పేరబోయిన గాలయ్య , మాసాన్‌పల్లి

త్వరలో ప్రారంభిస్తాం

గుండాల మండలంలోని 20 గ్రామపంచాయతీలకు నాలుగు గ్రామపంచాయతీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. మిగితా గ్రామాల్లో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దు. తొందరపడి రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు.

-నాగయ్య, సీఈవో, గుండాల